ఖాజీపూర్‌లో డెంగీ పంజా

మిరుదొడ్డి, ఆగస్టు 12: అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్‌లో డెంగీ పంజావిసురుతుంది. గ్రామానికి చెందిన నలుగురు సిద్దిపేటలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో గతంలో కూడా డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇటీవల కొందరికి పరీక్షలను నిర్వహించగా డెంగీగా నిర్ధారణ అయ్యింది. అయిన కూడా అధికారులు ప్రజల ప్రాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో పారిశుధ్య పనులను నిర్వహించి, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సంగారెడ్డి పాత బస్టాండ్‌లో

రూ.15 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలి



మంత్రిని కోరిన జగ్గారెడ్డి

సంగారెడ్డిటౌన్ , ఆగస్టు 12: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పాత బస్టాండ్‌లో రూ.15 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన జగ్గారెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన ప్రతిపాదనల ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డిలోని పాత బస్టాండు వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తే చిరువ్యాపారులకు ప్రయోజనం కలుగుతుందని, ఆర్టీసీకి కూడా ఆదాయం చూకూరుతుందని తెలిపారు. రూ.15 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జగ్గారెడ్డి తెలిపారు.



స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్ ఆగస్టు 12: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై చర్చించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు 15న గ్రామపంచాయతీ, మండల కార్యాలయాల్లో ఉదయం 8 గంటలకు, ఐడీవోసీ, జిల్లా అధికారుల కార్యాలయాల్లో ఉదయం 8.30 గంటలకు జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. ఉదయం 9.30 గంటలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ముఖ్యఅతిథితో జాతీయ జెండా ఎగురవేసిన తర్వాత జిల్లాస్థాయిలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకలకు అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు. ప్రభుత్వ పథకాల శకటాలను ప్రదర్శించాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలపై స్టాల్స్ ఏర్పా టు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 37 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. దళిత బంధు పథకాన్ని పూర్తిస్థాయిలో అందించాలని కోరుతూ ఇప్పటి వరకు మంజూరైన రూ.3 లక్షల విడుదల చేయాలని 150 మంది లబ్ధిదారులు వినూత్నంగా ఒక్కొక్కరుగా ఫిర్యాదు చేశారు. హుస్నాబాద్ మున్సిపల్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ తెలిపారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం.. ఇద్దరు యువకులు మృతి
- డీసీఎం డ్రైవర్ పరిస్థితి విషమం
- గుర్రాలసోఫా వద్ద ప్రమాదం


వంశీ(ఫైల్)


నవీన్(ఫైల్)

రాయపోల్, ఆగస్టు 12 : రాయపోల్ మండలం గుర్రాలసోఫా వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లికి చెందిన మామిళ్ల వంశీ (19), నవీన్ (20) సోమవారం సాయంత్ర బైక్‌పై గజ్వేల్ పట్టణానికి బయలుదేరారు. అదే సమయంలో గజ్వేల్ నుంచి చేగుంట వైపు మొక్కజొన్న కంకుల లోడుతో వేగంగా వెళ్తున్న డీసీఎం రాయపోల్ మండలం గుర్రాలసోఫా వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. వీరి వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాయపోల్ మండలం ఎల్కల్‌కి చెందిన డీసీఎం డ్రైవర్ రాకేశ్‌ను చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడం తో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఘటనా స్థలం వద్ద మృతుల కుటుంబీకులు రోదనలు మిన్నంటాయి. ప్రమాదం కారణంగా గజ్వేల్, చేగుంట రహదారిపై వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ రఘుపతి. దౌల్తాబాద్ ప్రదీప్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల, మహిళల రక్షణకు పెద్దపీట

సిద్దిపేట క్రైం : పిల్లల, మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ పేర్కొన్నారు. సోమవారం పోలీస్ కమిషనరేట్‌లో షీటీం, భరోసా సెంటర్, స్నేహిత సెంటర్ అధికారులు, సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. షీ టీం, భరోసా, స్నేహిత, సిబ్బంది అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి మహిళల, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. ప్రతిరోజూ స్కూళ్ల, కాలేజీలు, తదితర ప్రాంతాల్లో మహిళల రక్షణకు చట్టాలపై, భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. హాట్‌స్పాట్ల వద్ద కంప్లయింట్ బాక్సులు ఏర్పాటు చేయాలని మహిళా ఇన్‌స్పెక్టర్ దుర్గాకు సూచించారు. షీటీం జిల్లా నంబర్, షీటీమ్ సిబ్బంది నంబర్లు కాలేజీలు, స్కూళ్ల వద్ద పిల్లలకు కనపడేలా బోర్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ యస్.మల్లారెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, మూడు డివిజన్ల షీ టీమ్ సిబ్బంది, సిద్దిపేట భరోసా సెంటర్ సిబ్బంది, మహిళ స్నేహిత, మహిళా సపోర్టు సెంటర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సచ్ఛదనం-పచ్చదనం

నామమాత్రం

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పైపై పనులతో ఐదురోజుల ప్రణాళిక
- విజృభిస్తున్న దోమలు, ఈగలు
- పత్తాలేని ప్రత్యేకాధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


గ్రామంలో రోడ్డు పక్కనే పడేసిన చెత్త, పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు


గుర్రాలగొందిలో గ్రామపంచాయతీ వాహనం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 12 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం అధికారుల తీరు వల్ల విమర్శలు మూటగట్టుకుంటున్నది. ఈనెల 5న ప్రారంభించి ఐదు రోజుల పాటు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఫొటోలకే పరిమితమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలోని పలు గ్రామాల్లోని కాలనీల్లో, మురుగు కాలువల్లో చెత్తా, పిచ్చిమొక్కలు ఎక్కడికక్కడే పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ఫలితంగా దోమలు విజృంభించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై ఆర్భాటం తప్ప క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పు కనపడడం లేదని ప్రజలు బాహటంగానే చర్చించుకుంటున్నారు. సరిపడా నిధులను ప్రభుత్వం కేటాయించకపోవడం వల్లే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం లక్ష్యం నెరవేరలేదని అధికారులే చర్చించుకోవడం కొసమెరుపు.

జిల్లాలో 499 గ్రామపంచాయతీలున్నాయి. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో కొన్ని గ్రామాల్లో ప్రధాన చౌరస్తాల్లో, కాలనీల్లో రోడ్ల వెంట అక్కడక్కడ మాత్రమే పారిశుధ్య పనులు, మురుగుకాలువలు శుభ్రం చేశారు. గ్రామాల్లోని లోపల ఉన్న కాలనీల్లో ఎక్కడికక్కడ పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. గ్రామాల్లో సుమారు 40 శాతం మాత్రమే పూర్తిచేసినట్లు తెలుస్తోంది. ఐదురోజుల పాటు చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో తూతూమంత్రంగానే అధికారులు పనులు చేపట్టినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అంతంత మాత్రంగానే పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సర్పంచుల పదవీకాలం పూర్తికాగానే ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వారు కనీసం చుట్టపుచూపుగా అయినా గ్రామాల్లో కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని ఆయా గ్రామాల్లోని పలు కాలనీల్లోని మురికి కాలువలు గడ్డి, పిచ్చిమొక్కలతో నిండి కంపుకొడుతున్నాయి. దోమలు వ్యాప్తి కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో కావడంతో గడ్డి, పిచ్చిమొక్కల్లో దోమలతో పాటు ఇతర విషపురుగులు సంచరిస్తుండడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు గ్రామాల్లో రోజూ వారి పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పూల్లురులో చెత్త, పిచ్చిమొక్కలతో నిండిపోయిన మురుగుకాలువ


ఇర్కోడులో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ (ఫైల్)

అన్నను హతమార్చిన తమ్ముడు

3


హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

జాతీయ జెండాను గౌరవించని వారు

దేశంలో ఉండడం అవసరమా?

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 12 : జాతీయ జెండాను గౌరవించని వాళ్ల దేశంలో ఉండడం అవసరమా? అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీ రఘునందన్‌రావు హాజరయ్యారు. తిరంగా ర్యాలీని ప్రారంభించి పురవీధుల్లో తిరిగారు. ర్యాలీలో విద్యార్థులు జాతీయ జెండాను ప్రదర్శించారు. అనంతరం పాత బస్టాండ్ సర్కిల్ వద్ద ఎంపీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాల అవుతున్నందున ప్రతి వ్యక్తి తన ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారన్నారు. ఈ దేశంలో కొంత మంది తాము జాతీయ జెండా ఎగురవేయమని, జాతీయ గీతం పాడమని అంటున్న వారు మన దేశంలో ఉండడం అవసరమా ప్రజలు ఆలోచించాలన్నారు. బంగ్లాదేశ్ ప్రధాని మన దేశానికి వచ్చి శరణు కోరుతుందంటే మన దేశ బలమేంటో అర్థం చేసుకోవాలన్నారు. ఎవరైతే జాతీయ జెండా ఎగురవేయ, పాలస్తీనా జిందాబాద్ అని పార్లమెంటులో నినాదాలు చేస్తాడో అలాంటి వారు ఈ దేశంలో పోటీ చేయకుండా చట్టం తేవాలన్నారు. మన దేశ గౌరవాన్ని కాపాడని వాళ్లు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండేందుకు చట్టం చేసేందుకు ఆలోచన చేస్తున్నామని రఘునందన్ రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి, అంబటి బాలేష్ గౌడ్, రామచంద్ర రావు, రామచంద్ర రెడ్డి,విద్యాసాగర్ విభీషన్ రెడ్డి,కోడూరి నరేష్,గోనె మార్కండేయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

దుబ్బాక: ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైనా వైద్యం అందించాలని ఎంపీ రఘునందన్‌రావు వైద్యులకు సూచించారు. సోమవారం దుబ్బాకలోని వందపడకల ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. గతంలో తాను అందించిన అంబులెన్స్‌పై తనఫొటోతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యసిబ్బంది కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వైద్యులకు సూచించారు. త్వరలోనే తన సొంతనిధులతో మరొక అంబులెన్స్‌ను అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ సింగ్, వైద్యసిబ్బంది, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బాలేష్‌గౌడ్, కౌన్సిలర్ మల్లారెడ్డి, నాయకులు వెంకట్‌గౌడ్, ప్రవీణ్, బద్రి, రమణరెడ్డి, రమేష్‌రెడ్డి, రాజేష్, మనోజ్ తదితరులున్నారు.


దుబ్బాక ఆసుపత్రిలో సిబ్బంది, రోగులతో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుందిగల్ యాదగిరి

వర్గల్, ఆగస్టు 12 : విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు తప్పవని సదరు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుందిగల్ యాదగిరి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దశల వారీగా నిరసనలు చేపడతామని, సమ్మెకు పిలుపునిస్తామన్నారు. వర్గల్ మండల వనరుల కేంద్రం వద్ద విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగులకు సోమవారం సమగ్ర శిక్ష వర్గల్ మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని, విధి నిర్వహణలో పనిభారం అధికమవడంతో చాలామంది తనువు చాలించారన్నారు. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వంలోగాని, సమగ్ర శిక్షలో గాని ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డ్యాగ నవీన్‌కుమార్, జిల్లా కోశాధికారి సొప్పరి కరుణాకర్, జిల్లా మహిళ అధ్యక్షురాలు వరలక్ష్మి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత, మండల అధ్యక్షుడు ర్యాకల భూపాల్ తదితరులు పాల్గొన్నారు.


మరణించిన ఉద్యోగులకు నివాళులర్పించి నినదిస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది

అధికారుల అండదండలతో పేదల భూముల పట్టామార్పిడి

- మాజీ కోఆప్షన్ సభ్యుడి నిర్వాకంపై విచారణ జరపాలి
- ధరణి ప్రక్షాళన కమిటీ సభ్యుడు కోదండరెడ్డి

మద్దూరు, ఆగస్టు 12 : అధికారుల అండదండలతో పేదల భూములను కుటుంబసభ్యుల పేరిట అక్రమంగా పట్టామార్పిడి చేసుకున్న మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ జిలానీ నిర్వాకంపై విచారణ చేయాలని తహసీల్దార్‌ను ధరణి ప్రక్షాళన కమిటీ సభ్యుడు కోదండరెడ్డి కోరారు. బాధిత రైతుల వినతి మేరకు ఆయన సోమవారం మండలంలోని బంజరా గ్రామాన్ని సందర్శించారు. రైతుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులతో కలిసి ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి తహసీల్దారు సంజీవ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ మాజీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ జిలానీ తండ్రి దస్తగిరి 1972లో సాదాబైనామాల ద్వారా పలువురు పేదరైతులకు భూములను విక్రయించాడన్నారు. వారసత్వంగా వస్తున్న ఈ భూములను వారి వారసులు కూడా కబ్జాలో ఉంటూ కాస్తు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పట్టా కోసం పలుమార్లు రైతులు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, అధికారులు, సిబ్బంది అండదండలతో జిలానీ ఆ దరఖాస్తులను మాయం చేయించాడని ఆరోపించారు. ధరణి పోర్టల్ వచ్చాక సైతం బాధిత రైతులు పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నా రెవెన్యూ సిబ్బంది సహకారంతో అడ్డుకున్నాడని మండిపడ్డారు. ఆనాడు బీఆర్ఎస్ అధికారాన్ని అడ్డంపెట్టుకుని తమ కుటుంబసభ్యుల పేరిట అక్రమంగా 40 ఎకరాల భూములను పట్టామార్పిడి చేసుకున్నాడని ఆరోపించారు. దర్జాగా రైతుబంధు సైతం పొందుతూ పేద రైతులకు తీరని అన్యాయం చేశాడని కోదండరెడ్డి ధ్వజమెత్తారు. అంతేకాకుండా సుమారు రెండున్నర ఎకరాల చెలకపోషి కుంటను కబ్జా చేశాడని ఆరోపించారు. ఈ విషయాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని బాధిత రైతులకు ఆయన హామీ ఇచ్చారు. కోదండరెడ్డితో కలిసి ఫిర్యాదు చేసిన వారిలో జంగిలి యాదగిరి, జంగిలి ఆంజనేయులు, జంగిలి భిక్షపతి, జంగిలి స్వామి, జంగిలి మల్లేశం, రాసూరి ఉప్పలయ్య, రాసూరి బీరయ్య, రాసూరి ఉపేందర్, రాసూరి చంద్రయ్య, రాసూరి మల్లయ్య, గుడిసె యాదగిరి, గుడిసె సత్యనారాయణ, గుడిసె కిష్టయ్య, మీస సిద్ధిలింగం ఉన్నారు.


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కోదండరెడ్డి

పొలానికి నీరు పెడుతుండగా..
విద్యుదాఘాతంతో రైతు మృతి


రైతు జిందేష్ (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 12: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని కొట్టాలలో సోమవారం చోటుచేసుకున్నది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గరబోయిన జిందేష్(40) సోమవారం ఉదయం తన వరి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోరు మోటారుకు సరఫరా అయ్యే వైరు తెగి పడగా, అది గమనించని జిందేష్ వైరును తాకడంతో కరెంటు షాక్ తగిలి కిందపడి పోయాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. స్పృహకోల్పోయిన జిందేష్‌ను చికిత్స నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ తగాదాతో సోదరుడిపై రోకలిబండతో దాడి
● అక్కడికక్కడే మృతి చెందిన అన్న


రాజునాయక్(ఫైల్)

అక్కన్నపేట, ఆగస్టు 12 : భూ తగాదాలతో అన్నపై ఓ తమ్ముడు రోకలి బండతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన అక్కన్నపేట మండలం మసిరెడ్డి తండాలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గుగులోతు రాజునాయక్(54) అతడి తమ్ముడు మధ్య కొంతకాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇద్దరి మధ్య తరచూ జరుగుతున్న తగాదాలతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ జరుగుతుంది. ఈ తరుణంలోనే రాజునాయక్‌పై అతని సోదరుడు రోకలి బండతో దాడి చేశాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అనుమానాదాస్పద స్థితిలో వివాహిత మృతి

శివ్వంపేట, ఆగస్టు 12 : కుటుంబ తగాదాలతో అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన సంఘటన సోమవారం నవాబ్‌పేట్ గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని నవాబ్‌పేట్ గ్రామానికి చెందిన రాంపల్లి లత(33) ఈనెల 9న భర్త అంజిరెడ్డితో గొడవ పడింది. ఆమె అనారోగ్యం పాలవడంతో 10న తూప్రాన్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా మెరుగైన చికిత్స కోసం సూరారం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం లత మృతి చెందింది. కూతురు మరణంపై తండ్రి సుభాన్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. అయితే, భర్త అంజిరెడ్డి కొట్టడంతోనే మూడు రోజులుగా ఇంట్లో లేవలేని స్థితిలో లత ఉండగా ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

కడుపు నొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య


రామని రాము(ఫైల్)

ములుగు, ఆగస్టు 12 : కడుపు నొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొత్తూర్‌లో చోటుచేసుకున్నది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు గ్రామానికి చెందిన రామని రాము(26) వృత్తి రీత్యా గ్రామంలోని మిషన్ భగీరథలో పనిచేస్తున్నాడు. అయితే, సోమవారం రాము కొద్దిరోజులుగా కడుపునొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ రోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు రాము తల్లి దేవమ్మకు నీటిని వదిలి వస్తానని చెప్పి ఇంటి ఆవరణలోనే స్లాబ్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ములుగు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.


కుమారుడు, మనుమరాళ్ల మృతదేహాల వద్ద రోదిస్తున్న కృష్ణ తల్లి నాగమణి

అయ్యో.. బిడ్డ ఎంత పనైంది!

● అశ్రునయానాల మధ్య తండ్రి, ఇద్దరు కూతుళ్ల అంత్యక్రియలు
● ఒకే గొయ్యిలో ముగ్గురి మృతదేహాలు ఖననం

మనోహరాబాద్, ఆగస్టు 12: 'అయ్యో బిడ్డ ఎంత పని జరిగింది. ఒక్క ప్రమాదంలోనే కుటుంబం ఆగమైంది కదా.. తండ్రి ఇద్దరు బిడ్డలకు ఒకే రోజు రాసిపెట్టాడా ఆ దేవుడు' అంటూ అక్కడున్న వారంతా కన్నీరు మున్నీరయ్యారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాక్‌మెన్ కృష్ణ(42), అతని ఇద్దరు కూతుళ్లు వర్షిత (12), వరణి(7) ఆదివారం మేడ్చల్ జిల్లా గౌడవెల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీకొని చనిపోయిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను సోమవారం స్వగ్రామమైన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేటకు తీసుకురాగా గ్రామస్థుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. గ్రామానికి చెందిన నారాయణ, నాగమణిల చిన్నకుమారుడైన కృష్ణకు రైల్వేలో పనిచేసిన తండ్రి ఉద్యోగ విరమణ చేయడంతో ఉద్యోగం వచ్చింది. పని నిమిత్తం కృష్ణ పదేళ్లుగా మేడ్చల్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఈ ఘోరం జరగగా, సోమవారం గ్రామంలో తండ్రీకూతుళ్ల అంత్యక్రియలు నిర్వహించారు.. ఒకే గొయ్యిలో తండ్రి, ఇద్దరు కూతుళ్లను ఖననం చేశారు. అయితే తండ్రి, ఇద్దరు కూతుళ్లు ఒకే ప్రమాదంలో జరగడంతో తల్లి నాగమణి కుమారుడు, మనమరాళ్ల మృతదేహాల వద్ద పడి రోదించడం అక్కడి వారిని కదలించి వేసింది. బాధిత కుటుంబాన్ని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు.

లక్ష్యానికి దూరంగా పాలసేకరణ

అస్తవ్యస్తంగా జహీరాబాద్ మిల్క్ చిల్లింగ్ కేంద్రం నిర్వహణ

జహీరాబాద్, ఆగస్టు 12 : జహీరాబాద్ నియోజకవర్గంలో పాలఉత్పత్తి పుష్కలంగా ఉన్నప్పటికీ సేకరణలో మాత్రం మిల్క్‌చిల్లింగ్ కేంద్రం లక్ష్యానికి దూరంగా ఉంది. ఆసక్తి గల పాడిరైతులను ప్రోత్సహించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణంలోని మిల్క్‌చిల్లింగ్ కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

శిథిలావస్థలో భవనం

జహీరాబాద్ పట్టణంలో 1973లో మూడు ఎకరాలలో ఏర్పాటు చేసిన మిల్క్‌చిల్లింగ్ కేంద్రం భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నది. చిల్లింగ్ చేసే, అధికారులు విధులను నిర్వహించే భవన గోడలకు తేమ పడుతున్నది. నిర్వహణ సరిగ్గా లేక కేంద్రంలోని సామగ్రి తుప్పుపడుతున్నది. ఉద్యోగుల క్వార్టర్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కేంద్రం చుట్టూ స్థలం కబ్జాలకు గురవుతున్న పట్టించుకోవడం లేదు.



జహీరాబాద్ పట్టణంలోని మిల్క్ చిల్లింగ్ కేంద్రం

సకాలంలో చెల్లించని బిల్లులు

జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రతీరోజు 40 వేల పైచిలుకు లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుంది. అందులో నుంచి మిల్క్‌చిల్లింగ్ కేంద్రం మాత్రం ఐదు వేల లీటర్ల సేకరణకే పరిమితమైంది. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాల్లో మాత్రమే పది వేల లీటర్ల పైచిలుకు పాలను సేకరిస్తామని, మిగతా సమయాల్లో ఐదు వేలపైచిలుకు లీటర్లు వస్తాయని అధికారులు తెలిపారు. స్థానికంగా సేకరించిన పాలను హైదరాబాద్‌లోని తార్నాక, లాలపేటకు తరలిస్తారు. అక్కడ పాల ఉత్పత్తులు తయారు చేసి వివిధ ప్రాంతాల్లో విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుకాణాలకు సరఫరా చేస్తారు. ఆరు మండలాల పరిధిలోని 52 గ్రామాల ద్వారా నిత్యం పాలను సేకరిస్తారు. ప్రోత్సాహకం కరువవడం, మార్కెట్ డిమాండ్ తగినట్లు ధర ఇవ్వకపోవడంతో రైతులు ఆసక్తి కనబరచడం లేదు. పాడిరైతులకు సకాలంలో పాల సేకరణ డబ్బు ఇవ్వకపోవడమే దీనికి ప్రధాన కారణం. మిల్క్‌చిల్లింగ్ కేంద్రం లీటరు పాలకు సుమారు రూ.50 ఇస్తుండగా ఇతర డెయిరీలు అంతకుమించి వెంటవెంటనే చెల్లిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో లీటరు పాలు రూ.80 పలుకుతుంది. మిల్క్‌చిల్లింగ్ కేంద్రానికి పాలను పోస్తే నష్టపోతామని రైతులు ఇటువైపు చూడడం లేదు.


పూర్తిగా ధ్వంసమైన సిబ్బంది క్వార్టర్లు

రూ.75లక్షల బిల్లుల పెండింగ్



మామిడిగి, గణేష్‌పూర్, హుసెల్లి తదితర గ్రామాలల రైతుల వద్ద రోజూ 900 లీటర్లు పాలను సేకరించి మిల్క్ చిల్లింగ్ కేంద్రానికి తీసుకొస్తా. సెంటర్ పరిధిలో 55 రోజులకు సుమారు 300 మంది రైతులకు రూ.75లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నా ఒక్కనికే రూ.20లక్షలు రావాల్సి ఉంది. రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన చేసేందుకు రైతులందరం కలిసి సన్నద్ధమవుతున్నాం.

- మాణిక్‌రెడ్డి, మామిడిగి రైతు

ఎక్కువ పాల సేకరణ కోసం కృషి



మిల్క్ చిల్లింగ్ కేంద్రంలో ఎక్కువ మొత్తంలో పాల సేకరణకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లో తిరిగి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు అవసరమైన గేదేలను బ్యాంకుల ద్వారా సబ్సిడీ ప్రాతిపదికన ఇప్పించేలా ప్రయత్నం చేస్తున్నాం. పాలను సరఫరా చేసే రైతులకు పశువులకు దాణాను సబ్సిడీపై అందిస్తాం. ఎక్కువ మొత్తంలో పాలను తీసుకువచ్చి కేంద్రం అభివృద్ధికి కృషి చేయాలని రైతులను కోరుతున్నాం.

- డేవిడ్‌రాజు, మిల్క్ చిల్లింగ్ కేంద్రం మేనేజర్

ఫార్మాసిటీ రద్దయ్యేవరకు ఆందోళనలు చేస్తాం

● భూముల కోసం రైతులకు అధికారుల బెదిరింపులు
● ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడితే సహించబోం
● జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మండిపాటు
● రద్దుచేయాలని ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందజేత


ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, రైతులు

జహీరాబాద్/న్యాల్‌కల్, ఆగస్టు 12 : ఫార్మాసిటీ రద్దు చేసేంతవరకు ఆందోళనలు చేపడతామని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హెచ్చరించారు. సోమవారం ఆయన రైతులతో కలిసివచ్చి జహీరాబాద్ పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందజేశారు. న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్ గ్రామంలో రైతులతో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, మల్గి, వడ్డీ గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీ కోసం రెండు వేల ఎకరాల్లో భూసేకరణకు చర్యలు చేపడుతున్న తీరు సరికాదన్నారు. రైతులపై అధికారులు బెదిరింపులకు పాల్పడడంపై మండిపడ్డారు. రైతుల, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నాకే అధికారులు నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడితే సహించబోమని ఆయన హెచ్చరించారు. రైతులను భయభ్రాంతులకు గురిచేస్తు భూమలను తీకుంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. పచ్చని పల్లెప్రాంతాల్లో కాలుష్య కారక కర్మాగారాల ఏర్పాటుతో భవిష్యత్తులో ప్రజారోగ్యాలపై తీవ్రప్రభావం చూపుతుందని ధ్వజమెత్తారు. రైతులకు వెన్నుదన్నుగా ఉంటూ వారి పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జహీరాబాద్ ప్రాంతంలో ఏర్పడిన పలు పరిశ్రమలతో ప్రజలు నిత్యం నరకయాతను అనుభవిస్తున్న తీరును ఆయన ఆర్డీవోకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, బీఆర్ఎస్ జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల అధ్యక్షులు తట్టు నారాయణ, డప్పూర్ రవీందర్, నాయకులు విజయకుమార్, గుండప్ప, శివరాజ్, నర్సింహారెడ్డి, రవికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కోహీర్‌లో విద్యార్థిని వెంటపడి కరిచిన కుక్క

స్కూలు బయట నిలిచి ఉన్న ముగ్గురిపై దాడి


కుక్క కాటుతో మోకాలికి అయిన గాయాన్ని చూపుతున్న ఫైజానూరిన్

కోహీర్, ఆగస్టు 12 : కోహీర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థినిపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచిన సంఘటన సోమవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఫైజా నూరిన్ మధ్యాహ్నం సమయంలో స్కూలు గేటు వద్ద తన స్నేహితురాళ్లతో నిలుచుని ఉంది. ముగ్గురు విద్యార్థులపైకి ఓ వీధి కుక్క దాడి చేసేందుకు రాగా వారు భయపడి పరిగెత్తారు. ఇద్దరు విద్యార్థులు తప్పించుకోగా ఫైజా నూరిన్‌పై కుక్క దాడి చేసింది. విద్యార్థినిని మోకాలు, నడుముపై కరచి గాయపరిచింది. తక్షణమే విద్యార్థిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం కోహీర్ గ్రామంలో వీధి కుక్కల నివారణ కోసం చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఏ వీధిలో చూసినా కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. జహీరాబాద్ పట్టణంలో ఉన్న కుక్కలను కోహీర్ శ్రీవారు ప్రాంతానికి ట్రక్కుల్లో తీసుకు వచ్చి వదిలినట్లు గ్రామ ప్రజలకు పేర్కొన్నారు. అధికారులు స్పందించి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్నటువంటి కుక్కల నుంచి ప్రజలను రక్షించాలని పలువురు కోరుతున్నారు.

కాలుష్య కారక పరిశ్రమతో పంటలకు దెబ్బ

చర్యలు తీసుకోవాలి : ఉసిరికపల్లి గ్రామస్థులు


ఉసిరికపల్లిలో పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

శివ్వంపేట, ఆగస్టు 12 : కాలుష్య కారక పరిశ్రమతో పంటలు దెబ్బతింటున్నాయని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఉసిరికపల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో ఫేర్మాక్ బయో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను ఏర్పాటు చేస్తుండడంతో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ సాదుల, బీఆర్ఎస్ నాయకులు కృష్ణారావు అభ్యంతరం వ్యక్తం చేస్తూ గ్రామస్థులతో కలిసి సోమవారం పరిశ్రమ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా అశోక్ సాదుల మాట్లాడుతూ కెమికల్ పరిశ్రమ నిర్మాణంతో రాబోయే రోజుల్లో ప్రజలు అనారోగ్య బారిన పడే అవకాశం ఉంటుందని, పరిశ్రమ ఏర్పాటును నిలిపివేయించాలని కోరారు.



తప్పిన ముప్పు..

పెచ్చులూడిన పాఠశాల సీలింగ్

సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్ (నల్లవాగు) పాథమికోన్నత పాఠశాలలో తృటిలో ప్రమాదం తప్పింది. సోమవారం పాఠశాలలో వరండా పైకప్పు సీలింగ్ పెచ్చులూడి పడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు మరో హాల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తుండడంతో ప్రమాదం తప్పింది. స్కూల్‌లో 90 మంది విద్యార్థులు చదవుకుంటున్నారు. పెచ్చులూడిన చోట తరగతులు నిర్వహిస్తుంటారు. ప్రమాద సమయంలో విద్యార్థులు అక్కడ లేకపోవడంతో టీచర్లు ఊపిరి పీల్చుకున్నారు.

-కల్హేర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి)

కొబ్బరిచెట్టు పైనుంచి పడి యువకుడి మృతి


దశరథ్ మృతదేహం

జహీరాబాద్, ఆగస్టు 12 : కొబ్బరికాయలను తెంపేందుకు చెట్టు ఎక్కిన యువకుడు కాలుజారి కిందపడి మృతి చెందిన సంఘటన జహీరాబాద్ పట్టణంలో సోమవారం చోటుచసుకున్నది. ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన కథనం ప్రకారం.. పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన మృతుడు చిట్టెం దశరథ్(32) శ్రీరాంమహేళాలోని గాదరాజు ఇంట్లో కొబ్బరికాయలను తెంపేందుకు వెళ్లాడు. చెట్టుపైకి ఎక్కి కొబ్బరికాయలను తెంపుతున్న క్రమంలో కాలుజారి కిందపడడంతో మృతిచెందాడు. ఆయన వివరించారు. దశరథ్ భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

కుక్కల దాడిలో మిషన్ భగీరథ కార్మికులకు గాయాలు


బాచేపల్లిలో కుక్కల దాడిలో గాయపడిన నగేష్

నారాయణఖేడ్, ఆగస్టు 12 : నిజాంపేట మండలం బాచేపల్లిలో సోమవారం కుక్కల దాడిలో మిషన్ భగీరథకు చెందిన ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాచేపల్లిలోనిపెద్దమ్మ ఆలయం వద్ద గల నీటి ట్యాంకును క్లోరినేషన్ చేయడానికి సోమవారం ఉదయం వాటర్‌మెన్ భూమయ్య, సహాయకుడు పోగుల నగేష్ వెళ్లారు. ట్యాంకు వద్ద వారిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. కుక్కల దాడిని గమనించిన గ్రామస్థులు అరుపులు వేయడంతో అవి పారిపోయాయి. కాగా గ్రామానికి చెందిన చాకలి రమేష్ కూతురు వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కలు దాడి చేయడానికి యత్నించాయి. అక్కడ ఉన్న స్థానికులు రాళ్లతో వాటిని తరమివేయడంతో, బాలికకు ఎలాంటి గాయాలు కాలేదు. గ్రామంలో 80 నుంచి 100 వరకు వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని, దీంతో గ్రామంలో తిరగడానికి భయం వేస్తుందని, చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కుకునూరుపల్లి, ఆగస్టు 12 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన చింతల ఉపేందర్, తన్నీరు గణేష్ ఆటో, డీసీఎం వ్యాన్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన టాస్క్‌ఫోర్స్ బృందం పోలీసులతో చిన్నకిష్టాపూర్‌లో వాహనాలను పట్టుకుని 50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాలను, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

గజ్వేల్‌లో 20 క్వింటాళ్లు..

గజ్వేల్, ఆగస్టు 12: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం గ్రామం మోహినిగడ్డ తండాకు చెందిన భూక్య నితిన్ ఆటోలో అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని గజ్వేల్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, పోలీసులు గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధి ముట్రాజ్‌పల్లి చౌరస్తా వద్ద ఆటోను పట్టుకుని 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధి ముట్రాజ్‌పల్లిలో పట్టుకున్న ఆటో, నిందితుడిని చూపుతున్న పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందం

రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 12: సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని టోల్‌గేట్ రెస్టారెంట్‌లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటల్‌లోని వంటగది అపరిశుభ్రంగా ఉండటం, హెయిర్ నెట్, గ్లౌజ్‌లు లేకుండా ఫుడ్ హ్యాండర్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. అదేవిధంగా డస్ట్ బిన్లు మూతలు లేకుండా ఉన్నాయని, పాక్షికంగా తయారుచేసిన ఆహార పదార్థాలు నేలపై ఉంచారని, అవి కలుషితమయ్యే అవకాశం ఉందని, ఫుడ్ హ్యాండర్లు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందుబాటులో లేనందున షోకాజ్ నోటీస్ జారీచేశామని, ఎఫ్ఎస్ 2006 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎఫ్‌వోఎస్‌సీవోఎస్ యాప్ వీడియో టికెట్ నెంబర్‌పై ఫిర్యాదు అందడంతో తనిఖీ చేసినట్లు తెలిపారు.

సమష్టిగా పనిచేయాలి: డీఐఈవో

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 12: సమష్టిగా పనిచేస్తేనే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తామని డీఐఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల రికార్డులను, అధ్యాపకుల అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అధ్యాపకులతో మాట్లాడి విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ కళాశాలలో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుతారని, వారికి నాణ్యమైన విద్యనందించాలన్నారు.

రైతాంగాన్ని గోసపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- గోదావరి జలాలు అందించేందుకు చిత్తశుద్ధితో పోరాటం
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఆగస్టు 19: 'కాలమైంది.. వర్షాలు సమృద్ధిగా కురిసి గోదావరి నిండుగా ప్రవహిస్తుంది. నీటిని ఎత్తిపోసేందుకు మోటారు, పంపులు రెడీగా ఉన్నాయి. నిల్వ చేసేందుకు రిజర్వాయర్లు, పారించేందుకు కాలువలు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేక రైతాంగానికి నీళ్లు ఇవ్వకుండా సముద్రం పాలు చేస్తూ రైతాంగాన్ని గోసపెడుతుంది' అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణం, రూరల్, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన 147 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.39.01 లక్షలు విలువైన చెక్కులను సోమవారం స్థానిక రేణుకాగార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగ చేశారని, కానీ కాంగ్రెస్ దండగ చేసిందన్నారు. సాగునీళ్లతో పాటు రైతులకు రైతుబంధు ఇవ్వలేదని, దీంతో వడ్డీ వ్యాపారులు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారన్నారు. గతంలో రాష్ట్రంలో కేవలం 20 లక్షల ఎకరాలు సాగులో ఉండగా, కేసీఆర్ చొరవతో 70 లక్షల ఎకరాలు సాగులోకి తీసుకువచ్చారన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని చెప్పారు. చేర్యాల రెవెన్యూ డివిజన్‌తో పాటు గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు తాను అసెంబ్లీలో పోరాడానని, త్వరలో తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు రానున్నాయన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంలో భూకబ్జాలు చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, ఈ విషయమై త్వరలో పర్యటించి వెలుగులోకి తీసుకువస్తానన్నారు. కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన మాదాసు శ్రీహరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసహాయం అందించారు. మృతుడి కూతుళ్ల చదువుకు ఈ ఏడాది ఫీజు తానే భరిస్తానని హామీ ఇవ్వడంతో పాటు మృతుడి భార్య విద్యార్హతకు తగిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తానని భరోసా కల్పించారు. అలాగే చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలో ఏర్పాటుచేసిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సోమవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు.

గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్ చోరీ



ఆయిల్ చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

జగదేవ్‌పూర్, ఆగస్టు 12: ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయిల్‌ను చోరీ చేసిన సంఘటన జగదేవ్‌పూర్ మండలంలో చోటు చేసుకుంది. విద్యుత్ అధికారులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని పలుగుగడ్డ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 43 కేజీల కాపర్, 120 లీటర్ల ఆయిల్, దౌలాపూర్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 230 లీటర్ల ఆయిల్, లింగారెడ్డిపల్లి గ్రామంలో 120 లీటర్ల ఆయిల్, కేబుల్ చోరీకి గురైనట్లు తెలిపారు. వీటి విలువ మొత్తం రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఏఈ శివశంకర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు.

పాడి రైతులకు వెంటనే బిల్లులు చెల్లించాలి



పాడి రైతులతో కలిసి ధర్నా చేస్తున్న విజయ డెయిరీ చైర్మన్ లక్ష్మారెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 12: పాడి రైతులకు రెండున్నర నెలల నుంచి పాల బిల్లులు రావడం లేదని, వెంటనే బిల్లులు చెల్లించాలని విజయ డెయిరీ చైర్మన్ లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విజయ డెయిరీ నుంచి డిగ్రీ కళాశాల చౌరస్తా వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జిల్లా పాడి రైతులు దాదాపు ఆరువేల లీటర్ల పాలు విజయ డెయిరీకి విక్రయిస్తున్నారని, వీరికి 15 రోజులకోసారి పాల బిల్లులు అందించాలని, కానీ రెండున్నర నెలల నుంచి బిల్లులు రావడం లేదన్నారు. వెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడి రైతుల పాల్గొన్నారు.

సమాచారం

అక్రమ నిర్మాణాలపై విచారణ

చేర్యాల: చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో కొనసాగుతున్న అక్రమ ఇంటినిర్మాణాలపై ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎంపీవో మహబూబ్ అలీ విచారణ చేపట్టారు. సోమవారం గ్రామానికి చేరుకుని ఫిర్యాదులు అందించిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. జీపీ అనుమతులతో పాటు, సెట్‌బ్యాక్ పాటించకపోవడాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నానని పేర్కొన్నారు.

అంబేడ్కర్ మనవడిని కలిసిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు

మర్కుక్: మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి తాజా మాజీ సర్పంచ్ భాగ్య భిక్షపతి, తాజా మాజీ ఎంపీటీసీ, ధనలక్ష్మీకృష్ణ అంబేడ్కర్ మనవడు భీమ్‌రావు యశ్వంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

సీసీఎస్ సీఐగా అంజయ్య బాధ్యతల స్వీకరణ

సిద్దిపేట క్రైం: సీసీఎస్ నూతన సీఐగా అంజయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ డాక్టర్ బి.అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ అభినందించి శాంతిభద్రతలకు పెద్దపీట వేయాలని సూచించారు.

టీఎంసీ చైర్మన్‌కు సన్మానం

గజ్వేల్: తన్జీముల్ మసాజిద్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సయ్యద్ మతీన్‌ను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి సన్మానించారు. ఆయనవెంట కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, నాయకులు సంతోష్, విష్ణు, అజహర్‌పాషా, భిక్షపతి, సతీష్, సంపత్, నరేందర్, సంతోష్, మర్రి స్వామి, దయానంద్, కన్నా తదితరులున్నారు.

మల్లన్న ఆలయంలో వనమహోత్సవం

చేర్యాల: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఆధ్వర్యంలో సోమవారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఎల్లమ్మగుట్టపై ఏఈవో శ్రీనివాస్, ఉద్యోగులు మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సూపరింటెండెంట్ సురేందర్, శ్రీరాములు పాల్గొన్నారు.

జనవరి 18న నవోదయ ప్రవేశ పరీక్ష

సిద్దిపేట క్రైం: జిల్లాలో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు 2024-25 సంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయం వర్గల్‌లో ఆరో తరగతిలో అడ్మిషన్ పొందుటకు ప్రవేశ పరీక్ష 2025 జనవరి 18న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు సెప్టెంబరు 16వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏఐఎస్ఎఫ్ ధ్యేయం

- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల జనార్దన్



గజ్వేల్ పట్టణంలో ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్/సిద్దిపేట అర్బన్/చేర్యాల, ఆగస్టు 12: పోరాటాలే ఊపిరిగా, విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం విద్యార్థుల పక్షాన నిలబడుతున్న ఏకైక సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మాత్రమేనని సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జేరుపోతుల జనార్దన్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో ఇందిరా గాంధీ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని మెదక్ జిల్లా మాజీ నాయకులు స్వర్గం రాజేశం ఆవిష్కరించి, వేడుకలు నిర్వహించారు. వారితో ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు మంద పవన్, ఏఐఎస్ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేశ్, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు పాల్గొన్నారు. సమరశీల విద్యార్థి ఉద్యమాల సారథి అఖిల భారత విద్యార్థి సమాఖ్య అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు మంద పవన్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయం వద్ద సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్, జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కిష్టపురం లక్ష్మణ్ పాల్గొన్నారు. చేర్యాలలోని అంగడిబజారు చౌరస్తా ఆవరణలో యూనియన్ నాయకురాలు శ్వేత ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

పదవులు అమ్ముకుంటున్న తూంకుంట నర్సారెడ్డి

- కాంగ్రెస్ నాయకుడు నాగరాజుయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజుయాదవ్

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 12: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పదవులు అమ్ముకుంటున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే తన అనుచరుల ద్వారా దాడులకు, అక్రమ కేసులు పెడుతామంటూ బెదిరిస్తున్నాడని కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ నాయకుడు యేశం నాగరాజు యాదవ్ మండిపడ్డారు. సోమవారం సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. గజ్వేల్‌లో పార్టీ కార్యకర్తలపై నర్సారెడ్డి వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ప్రతిపక్షం, స్వపక్షం అని తేడా లేకుండా ఇబ్బందులకు గురిచేస్తుండని, నర్సారెడ్డి బీసీల వ్యతిరేకని, బీసీలు అంటే చిన్నచూపని, బీసీలను రాజకీయంగా అణగదొక్కుతూ డ్రామాలాడుతున్నారని ఆరోపించారు. తాను రాజకీయంగా ఎదుగుతుంటే ఓర్వ లేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఫ్లెక్సీల్లో దామోదర్ రాజనర్సింహ ఫొటోలు పెడితే.. ఎందుకు పెడుతున్నావు.. అతడికి గజ్వేల్‌కు ఏం సంబంధమని దూషిస్తున్నాడని తెలిపారు. నర్సారెడ్డి ఆగడాల గురించి పీసీసీ అధ్యక్షుడికి, క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లడ్డుయాదవ్, భిక్షపతి, విష్ణు పాల్గొన్నారు.

పీఎఫ్ డబ్బులను అకౌంట్‌లో జమచేయాలి: సీఐటీయూ



మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 12: మూడేళ్లుగా మున్సిపల్ కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్ డబ్బులను వారి అకౌంట్లో జమ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి అన్నారు. మున్సిపల్ కార్మికులతో కలిసి సోమవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. మూడేళ్ల నుంచి దాదాపు రూ.3 కోట్ల పీఎఫ్ డబ్బులు కార్మికుల అకౌంట్లలో వేయకపోవడం సరైంది కాదన్నారు. వెంటనే పీఎఫ్ డబ్బులు చెల్లించాలని, లేని పక్షంలో బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మాజీ చైర్మన్ కడవెరుగు రాజనర్సులు ధర్నా వద్దకు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, చర్చలకు రావాలని పిలిచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజు కుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గుర్రం నరసింహులు, దెబ్బట రాజయ్య, వినోద, రాజు, నరసింహులు, కార్మికులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ ఘటనలకు నిరసనగా ర్యాలీలు



సిద్దిపేట క్రైం: కాగడల ప్రదర్శన చేస్తున్న హిందూవాహిని కార్యకర్తలు

కుకునూరుపల్లి/దౌల్తాబాద్/సిద్దిపేట క్రైం, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా కుకునూరుపల్లి బంద్‌కు పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న నరమేధాన్ని నిరసిస్తూ ఛత్రపతి శివాజీ యూత్, బజరంగ్‌దళ్ హిందూవాదుల ఆధ్వర్యంలో స్వచ్ఛంద బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా రామాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్ద చేపట్టిన శాంతియుత నిరసన ర్యాలీలో హిందువులతో పాటు స్థానికులు, వ్యాపారులు పార్టీలకతీతంగా పాల్గొన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసిస్తూ సోమవారం దౌల్తాబాద్ మండలంలో హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పబ్బ అశోక్ గుప్తా, మాజీ సర్పంచ్ ఆది వేణు, బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ వాహిని రాష్ట్ర సంపర్క సహ సంయోజక్ భూమిరెడ్డి మాట్లాడారు. సిద్దిపేట పట్టణంలోని శివాజీ విగ్రహం నుంచి కమాన్ కిందుగా బస్టాండ్ వద్ద అంబేడ్కర్ సర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహించారు.

నెగ్గిన అవిశ్వాసం

- చేర్యాల పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ల తొలగింపు
- 14న చైర్మన్ ఎన్నికకు చర్యలు



అవిశ్వాసానికి మద్దతుగా చేతులు ఎత్తిన డైరెక్టర్లు

చేర్యాల, ఆగస్టు 12 : చేర్యాల పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ తాళ్లపల్లి నర్సయ్యపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. సోమవారం డీసీవో కరుణ ఆధ్వర్యంలో స్థానిక సొసైటీ కార్యాలయంలో అవిశ్వాస ప్రక్రియ సమావేశం చేపట్టడంతో, చైర్మన్ చంద్రారెడ్డి గైర్హాజరయ్యారు. వైస్‌చైర్మన్ తాళ్లపల్లి నర్సయ్య సహా 12 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. ముందుగా చైర్మన్‌పై, తదనంతరం వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసానికి డైరెక్టర్లంతా మద్దతుగా చేతులు ఎత్తారు. దీంతో కోరంకన్నా ఎక్కువగా ఉన్న సభ్యుల నిర్ణయాన్ని ఏకీభవిస్తూ అవిశ్వాసం నెగ్గిందని, చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల నుంచి తొలగిస్తున్నట్లు డీసీవో కరుణ తెలిపారు. ఈనెల 14న చైర్మన్ ఎన్నిక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్ల తీరుపై ఆది నుంచి గుర్రుమీదున్న డైరెక్టర్లు సెప్టెంబరు 12, 2023న డీసీవోకు అవిశ్వాస నోటీసు ఇచ్చారు. దీంతో అక్టోబరు 11, 2023న అవిశ్వాస పరీక్షకు నోటీసులు జారీ చేయడంతో చైర్మన్ చంద్రారెడ్డి అవిశ్వాసాన్ని సవాల్‌చేస్తూ సహకార ట్రిబ్యూనల్ కోర్టును ఆశ్రయించి స్టే పొందడంతో అవిశ్వాస ప్రక్రియ వాయిదా పడింది గతనెల 9న ట్రిబ్యూనల్ కోర్టు స్టే ఎత్తివేయడంతో పాటు కోర్టు ఆదేశానుసారం జిల్లా సహకార అధికారి బుధవారం అవిశ్వాస పరీక్ష నిర్వహించారు. పదవులు కోల్పోయిన ఇరువురు బీఆర్ఎస్‌కు చెందినవారు కాగా, అవిశ్వాస విజయంతో కాంగ్రెస్ పదవులు దక్కించుకోనుండటం చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు మేరుగు కృష్ణను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అవిశ్వాస సమావేశంలో అసిస్టెంట్ డీసీవో రఘోత్తంరెడ్డి పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతో పాఠశాలల అభివృద్ధి: డీఈవో

కొండపాక, ఆగస్టు 12: ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలలు పటిష్టమై అభివృద్ధి చెందుతాయని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం మార్స్ ఇండియా కంపెనీ సౌజన్యంతో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ సమాజం, కార్పొరేట్ కంపెనీలు విద్యార్థుల కోసం స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పీ.శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలీలు సంఘటితమై రాజకీయంగా ఎదగాలి: మల్లేశం

చేర్యాల, ఆగస్టు 12: జనాభాలో సముచిత స్థానంలోఉన్న పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు బూర మల్లేశం అన్నారు. చేర్యాల మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. 18న జరగనున్న రాష్ట్ర సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీచేస్తున్న తనకు మద్దతు పలికి గెలిపించాలని కోరారు.

ప్రభుత్వ బోరును గ్రామస్థులకు అప్పగించాలి

మిరుదొడ్డి, ఆగస్టు 12: గ్రామస్థుల దాహార్తిని తీర్చడానికి గతంలో అధికారులు బోరును వేయిస్తే, గ్రామంలోని వ్యవసాయానికి వాడుకుంటున్నారని గ్రామస్థులు మండిపడ్డారు. సోమవారం మిరుదొడ్డి మండలం అల్వాల మధిర గ్రామమైన రాంపూర్‌లో గ్రామస్థులు రోడ్డుపై ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఒకే వ్యక్తి బోరును అక్రమంగా వాడుకుంటున్నారని, ఆ బోరును అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎంపీడీవో, రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

'గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు'

గజ్వేల్, ఆగస్టు 12: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుం పేర్కొన్నారు. సోమవారం జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ 132వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతి రావు, లైబ్రేరియన్ డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన పీఆర్సీని ప్రకటించాలి: పీఆర్టీయూ

గజ్వేల్, ఆగస్టు 12: కాంగ్రెస్ ప్రభుత్వం పీఆర్సీని ప్రకటించాలని పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఊడెం వేమారెడ్డి, లింగంగౌడ్‌లు డిమాండ్ చేశారు. గజ్వేల్ మండల పరిధిలోని జడ్పీహెచ్ఎస్ ప్రజ్ఞాపూర్, జడ్పీజీహెచ్ఎస్(ప్రజ్ఞాపూర్), కోదండరాంపల్లి, తిమక్కపల్లి, శ్రీగిరిపల్లి, అక్కారం, దాతర్‌పల్లి, రిమ్మనగూడ, బూర్గుపల్లి, సింగాటం, అహ్మదీపూర్, కోల్గూర్, పిడిచెడ్ పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకీకృత సేవా నిబంధనలు తీసుకొచ్చి జూనియర్ లెక్చరర్లు, డైట్ లెక్చరర్లు, ఎంఈవో పోస్టులను ఉపాధ్యాయ పదోన్నతులతో భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శివశంకర్, ఉపాధ్యక్షుడు బాల్‌చరణ్, కనక రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

చిన్నకోడూరు, ఆగస్టు 12: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణికి 108 సిబ్బంది వాహనంలోనే ప్రసవం చేశారు. 108 అంబులెన్స్ ఈఎంటీ కిషన్, పైలట్ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మహ్మద్ పర్వీన్‌కు సోమవారం ఉదయం పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది అంబులెన్స్‌లో సిద్దిపేట ఆస్పత్రికి తరలిస్తుండగా సిద్దిపేట పట్టణ శివారులోకి వెళ్లగానే పర్వీన్‌కు పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 అంబులెన్స్ సిబ్బంది కిషన్, వెంకట్ గర్భిణికి వాహనంలోనే ప్రసవం చేశారు. పర్వీన్ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డకు ప్రథమ చికిత్స అందించి, సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు సిబ్బంది తెలిపారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అర్హులకు అన్యాయం

కొండపాక, ఆగస్టు 12: కొండపాకలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో అనర్హులకు స్థానం కల్పించి అర్హులకు అన్యాయం జరిగిందంటూ గ్రామానికి చెందిన జంజీరపు భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు ఇల్లు కేటాయించాలని సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశాడు. తనకు నివాసం లేదని, డబుల్ బెడ్‌రూం ఇంటికి దరకాస్తు చేసుకుంటే లబ్ధిదారుల లిస్టులో వచ్చిన పేరును తొలగించారని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ మాధురి దేవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే ఇల్లు వచ్చేలా చేస్తానని హామీఇచ్చినా రాలేదని వాపోయాడు. పంపిణీ చేయకుండా ఉన్న ఇళ్లలో తనకు ఇల్లు కేటాయించాలని కోరారు.

తలనీలాల టెండర్ ఆన్‌లైన్‌లో నిర్వహించాలి



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి

చేర్యాల, ఆగస్టు 12: కొమురవెల్లి మల్లన్న ఆలయంలో తలనీలాల టెండర్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని సీపీఎం కొమురవెల్లి మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కొమురవెల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తలనీలాల సేకరణకు గతేడాది రూ.86 లక్షలకు టెండర్ అవగా, ఈసారి తక్కువ ధరకు టెండర్ దక్కించుకునేందుకు ఓ కాంగ్రెస్ నాయకుడు తప్పుదోవ పట్టిస్తూ ఆదాయానికి గండికొట్టే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు.

'సర్వాయి పాపన్న జయంతిని అధికారికంగా జరపాలి'

చేర్యాల, ఆగస్టు 12: సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపాలని మోకుదెబ్బ కొమురవెల్లి మండలాధ్యక్షుడు మేరుగు కృష్ణ అన్నారు. సోమవారం కొమురవెల్లి మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వాయి పాపన్న వీరోచిత పోరాటాన్ని గుర్తించి జయంతి రోజున ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని, హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పచ్చిమడ్ల స్వామి, ముత్యం నర్సింహులు, కొయ్యడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అసంఘటిత కార్మికులకు చట్టభద్రత అవసరం'

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 12: అసంఘటిత కార్మికులకు చట్టభద్రత కల్పించాలని ముస్లిం హక్కుల పోరాట సమాఖ్య సిద్దిపేట జిల్లా కన్వీనర్ షేక్ దస్తగిరి (ఎంహెచ్‌పీఎస్), బీఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ శివరాత్రి శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం బహుజన కార్మిక సంఘాల సమాఖ్య ట్రేడ్ యూనియన్ మండలాలవారీగా కండువా కప్పి ఆహ్వానించి బాధ్యులను నియమించారు. ముదిరాజ్ సంఘం జిల్లా కన్వీనర్‌గా మండల శేఖర్, బీఎఫ్‌టీయూ ట్రేడ్ యూనియన్ సిద్దిపేట జిల్లా కో కన్వీనర్‌గా సుబ్బు, చేర్యాల మండల కన్వీనర్‌గా స్వామిను నియమించారు. ఈ కార్యక్రమంలో బీడీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దబ్బేట, ఆనంద్, శేఖర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో హెచ్‌ఈవో ఆకస్మిక తనిఖీ

మర్కుక్, ఆగస్టు 12: మర్కుక్ మండల పరిధిలోని చేబర్తి గ్రామాన్ని హెచ్‌ఈవో వెంకటరమణ సోమవారం సందర్శించారు. అనంతరం గ్రామ వీధుల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలతో కలిసి తిరుగుతూ డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణుల, బాలింతల, విద్యార్థుల టీకా రిజిస్టర్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, స్వప్న, ఆశా కార్యకర్తలు ధనలక్ష్మి, లత పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మిరుదొడ్డి/కొండపాక, ఆగస్టు 12: మండల కేంద్రమైన మిరుదొడ్డి గ్రామానికి చెందిన రాములు, ఐలయ్య, మక్బూల్, లక్ష్మి అనే బాధితులకు సోమవారం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్‌ను చెక్కులను బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన కాట ఎల్లంకు మంజూరైన రూ.25 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ అధ్యక్షుడు నూనె కుమార్ అందజేశారు.

భూ సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు విఫలం: సీపీఐ



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

జగదేవ్‌పూర్, ఆగస్టు 12: సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి అన్నారు. సోమవారం రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, మాట్లాడారు. జిల్లాలో గత ప్రభుత్వం నాలుగు ప్రాజెక్టులను నిర్మించిందని, ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతుల సమస్యలను అధికారులు పరిష్కరించడం లేదన్నారు. చిన్నచిన్న సమస్యలను కలెక్టరేట్‌కు వెళ్లాలని రైతులకు సూచించడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు భిక్షపతి, నరసింహారెడ్డి, మల్లారెడ్డి, రాజేశం, కృష్ణ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



దౌల్తాబాద్‌లో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

దౌల్తాబాద్/రాయపోల్/మిరుదొడ్డి/చేర్యాల, ఆగస్టు 12: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం దౌల్తాబాద్ మండలాధ్యక్షుడు అక్కం శేఖర్, ప్రధాన కార్యదర్శిగాడి రాజు డిమాండ్ చేశారు. సోమవారం దౌల్తాబాద్ మండల వనరుల కేంద్రం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు ఆరోగ్యబీమా రూ.5 లక్షలు, జీవిత బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. రాయపోల్‌లో సమగ్ర శిక్షలో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగులకు జిల్లా నాయకుడు మాసాయిపేట యాదగిరి నివాళులర్పించారు. అనంతరం డిమాండ్ల పత్రాలను చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగులకు సోమవారం మిరుదొడ్డి మండల వనరుల కేంద్రంలో నివాళులర్పించారు. చేర్యాలలోని కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి కృష్ణవేణి మాట్లాడారు.

శ్రావణ సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 12: శ్రావణమాసం తొలి సోమవారం కావడంతో సిద్దిపేట పట్టణంలోని కోటి లింగాలు ఆలయంలో ప్రజలు శివలింగానికి భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరిగింది. కొంతమంది భక్తులు శివుడిని దర్శించుకుని అక్కడే ఒక్క పొద్దు విడిచారు.